ప్రజాశక్తి

గురువారం 17 ఆగస్టు 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు

అభివృద్ధి పనులు తీసికట్టు!

- కాగితాలకే పరిమితమైన ఆర్‌వోబీ, ఆర్‌యూబీలు
- ముందుకు కదలని ఇన్నర్‌రోడ్డు మూడోదశ పనులు
- యూజిడిపై తొలగని పీఠముడి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులు మూరెడు ముందుకు బారెడు వెనక్కి అన్న చందంగా కొనసాగుతున్నాయి. దాదాపు రూ.5 కోట్లతో ఆధునీకరించిన గాంధీ పార్కు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. ▶ 2లో

ప్రతిఏటా జాబ్ కేలండర్

విద్యావ్యవస్థలో సమూల ప్రక్షాళన : నారా లోకేష్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి ఏటా జనవరిలోనే జాబ్ కేలండర్ ప్రకటిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చెప్పారు. మంగళగిరి సమీపంలోని యర్రబాలెంలో బుధవారం నిర్వహించిన 'హలో లోకేష్' కార్యక్రమంలో యువత వ్యక్తంచేసిన అభిప్రాయాలు, సందేహాలకు లోకేష్ సమాధానాలిచ్చారు. కార్యక్రమానికి టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మహాసేన ▶ 2లో

హామీలు, తీర్పులను విస్మరిస్తున్న ప్రభుత్వాలు

- పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం
- అంగన్వాడీల పోరుయాత్ర ప్రారంభంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

మాట్లాడుతున్న నేతాజి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా విలేకర్లు

అంగన్వాడీలకు ఇచ్చిన హామీలతోపాటు కోర్టు తీర్పుల అమలునూ ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ అన్నారు. ఈ నేపథ్యంలో హామీల అమలు, సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీల ▶ 2లో

నాగబ్రహ్మచారి, లక్ష్మణరావుకు నోటీసులు ఇస్తున్న పోలీసులు

విద్యుత్ స్ట్రగుల్ కమిటీ నాయకులపై
కొనసాగుతున్న నిర్బంధం

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ ఉద్యోగుల జెఎసితో యాజమాన్యం తిరోగమని విధానంలో చేసుకున్న వేతన ఒప్పందాన్ని రద్దు చేసి, 45 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ చేయాలని, తదితర సమస్యలపై స్ట్రగుల్ కమిటీ ఆందోళనలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో కమిటీ నాయకులపై పోలీసుల బెదింపులు కొనసాగుతున్నాయి. చలో విజయవాడకు వెళ్లవద్దని జిల్లాలో బుధవారం కూడా నోటీసులు అందచేశారు. జిల్లా నాయకులు సిహెచ్.నాగబ్రహ్మచారి, రాం ప్రభాకర్‌కు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు తదితరులకు పోలీసులు నోటీసులు అందించారు. ప్రభుత్వం తన నిర్బంధాన్ని ఆపాలని, తక్షణమే సమస్యలు పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు.

నరసరావుపేటలో ఆర్మీరిక్రూట్‌మెంట్ ర్యాలీ

మెయిన్‌లో

20 నుండి 26 వరకు నిర్వహణ

ట్రాన్స్‌జెండర్స్‌కు ప్రత్యేక ఓపీ విభాగం

జిజిహెచ్‌లో ప్రారంభించిన మహిళా భద్రత విభాగం ఎస్‌పి సరిత

8 లో

ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తదితరులు

ప్రజా సమస్యలపై అంకితభావంతో పనిచేసే ప్రజాశక్తి

వార్షికోత్సవ ప్రత్యేక సంచిక ఆవిష్కరణలో పల్నాడు కలెక్టర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాశక్తి దినపత్రిక అంకిత భావంతో పనిచేస్తుందని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అన్నారు. ప్రజాశక్తి 43వ వార్షికోత్సవం, స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రచురించిన ప్రత్యేక సంచికను కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జిల్లా కలెక్టర్, జెసి, ఇతర అధికారులు బుధవారం ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నంలో ప్రజాశక్తి శక్తివంతం లేకుండా పనిచేయటం స్ఫూర్తిదాయకమని అన్నారు. జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాశక్తి చేస్తున్న కృషి అభినందనీయమని, పత్రిక మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

ఫిరంగిపురంలో మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

హామీలు, తీర్పులను విస్మరిస్తున్న ప్రభుత్వాలు

(మొదటి పేజీ తరువాయి)

సమస్యల పరిష్కారం కోసం యూనియన్ ఆధ్వర్యంలో మూడ్రోజులపాటు జిల్లా వ్యాప్తంగా నిర్వహించే 'పోరుయాత్ర'ను మండల కేంద్రమైన ఫిరంగిపురంలో సుబ్బరావమ్మ బుధవారం ప్రారంభించారు. అనంతరం మేడికొండూరు, తాడికొండ, తుళ్లూరు మండలాల్లో యాత్ర పర్యటించింది. ఫిరంగిపురంలో సిడిపిఒ కార్యాలయానికి ప్రదర్శినగా వెళ్లి వినతిపత్రం ఇవ్వగా మేడికొండూరు మండలంలోని 14 గ్రామాల అంగన్వాడీలు తమ సమస్యలపై వినతిపత్రాలను పోరుయాత్ర బృందానికి ఇచ్చారు. ఆయా మండలాల్లో నిర్వహించిన సభల్లో సుబ్బరావమ్మ మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు విధుల్లో అనేక ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నారని, వారికి పనిభారం తగ్గించాలని కోరారు. హెల్పర్ల ప్రమోషన్లలో రాజకీయ జోక్యాన్ని నివారించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లోని ప్రధాన సమస్యలైన వంట పాత్రలు, గ్యాస్, ఫర్నిచర్, విద్యుత్, తాగునీటి సదుపాయాలను సత్వరమే కల్పించాలని కోరారు. ఫ్రీ స్కూల్ బలోపేతం చేయాలని అన్నారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజీ, ప్రధాన కార్యదర్శి దీప్తి మనోజ మాట్లాడుతూ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలన్నారు. 2017 నుండి పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నీ పరిష్కారం కావాలంటే ఐక్యంగా పోరాడాలని, పోరాటాలతోనే ఏ ప్రభుత్వమైనా దిగొస్తుందని చెప్పారు. కార్యక్రమాల్లో నాయకులు టి.రాధా, కె.విజయకుమారి, శ్యామల, ఎవియన్ కుమారి, పి.ధనలక్ష్మి, రజిని, ఎస్ఎం వలి, ఎం.ధనలక్ష్మి, పావని, పి.విజయకుమారి, వై.గాంధీ రామ్మోహనరావు, కె.పూర్ణచంద్రరావు, సిహెచ్.భాస్కరరావు, ఎం.రవి, ఎం.భాగ్యరాజు, విజయ, స్వర్ణలత, కరీమూన్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఫిరంగిపురంలో యూనియన్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పి.రజిని, కార్యదర్శి కె.విజయకుమారి, గౌరవాధ్యక్షులుగా ఎస్.ఎం.వలి, పది మంది సభ్యులు ఎన్నికయ్యారు.

ప్రతిఏటా జాబ్ కేలండర్

(మొదటి పేజీ తరువాయి)

రాజేష్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. లోకేష్ మాట్లాడుతూ పాత ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్ని అమలుచేసి విద్యార్థుల కష్టాలకు చెక్ పెడతామన్నారు. ఇప్పటికే ఆయా విద్యాసంస్థల్లో ఉండిపోయిన 2 లక్షలమంది సర్టిఫికెట్లను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా విద్యార్థులకు ఇప్పిస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరం నుంచే ప్రతిఏటా జాబ్ కేలండర్ విడుదల చేసి ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. యుపిఎస్‌సి మాదిరి ఎపిపిఎస్‌సిని పటిష్టపర్చి, నిర్ణీత సమయాల్లో ఉద్యోగాలకు పరీక్షలు, ఇంటర్వ్యూలు, నియమకాలు చేస్తామని చెప్పారు నాలుగేళ్లుగా యువత ఉద్యోగాల్లేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయని, నిరుద్యోగులు పొరుగు రాష్ట్రాలకు వలసవెళ్తున్నారని చెప్పారు. టిడిపి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ, ప్రైవేటు, స్వయం ఉపాధి రంగాల్లో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించారు.

మార్పు కోరుకుంటే ఓటేయండి

సమాజంలో మనం కోరుకునే మార్పు రావాలనుకునేవారు.. ఆ మార్పు ముందు మనలో రావాలని గాంధీ అన్నారు.. మీరు ఏ మార్పు కోరుకుంటున్నారో.. ఆ మార్పు కోసమే వచ్చే ఎన్నికల్లో మీరు ఓటేయాలి.. అని లోకేష్ అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా దాడులు, భూదందాలు జరుగుతున్నాయని, పక్క రాష్ట్రాల్లో పరిశ్రమలు వస్తున్నాయని, మన రాష్ట్రంలో చంద్రబాబు సిఎం అయితేనే దారి తప్పిన రాష్ట్రం గాడిలో పడుతుందని అన్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు 32 వేల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చారని, 2024లో టిడిపి అధికారంలోకి వస్తే పెండింగ్ ఉద్యోగాలన్నీ ఐదేళ్లఓ ఏళ్లలో భర్తీ చేస్తామని చెప్పారు.

నేటి పాదయాత్ర వివరాలు

మధ్యాహ్నం 2 గంటలకు యర్రబాలెం డాన్ బాస్కో స్కూలు వద్ద క్యాంప్ సైట్ నుంచి పాదయాత్ర ప్రారంభం

2.30 గంటలకు డోలాస్ నగర్‌లో స్థానికులతో మాటామంతి

2.50 గంటలకు ప్రకాష్ నగర్‌లో ఎస్సీలతో సమావేశం

3.10 గంటలకు నులకపేటలో స్థానికులతో సమావేశం

3.55 గంటలకు సాయిబాబా గుడివద్ద స్థానికులతో మాటామంతి

సాయంత్రం 4.05 గంటలకు సలామ్ సెంటర్‌లో స్థానికులతో సమావేశం

4.25 గంటలకు గేట్ సెంటర్‌లో రెడ్డి సామాజిక తరగతుల వారితో భేటీ

4.40 గంటలకు ఎన్టీఆర్ విగ్రహం వద్ద స్త్రీశక్తి లబ్ధిదారులతో సమావేశం

4.50 గంటలకు అంబేద్కర్ విగ్రహం వద్ద అగ్నికుల క్షత్రియులతో భేటీ

5.05 గంటలకు ఉండవల్లి సెంటర్‌లో ఎస్టీలతో సమావేశం

5.30 గంటలకు ఉండవల్లిలో స్థానికులతో మాటామంతి

రాత్రి 7 గంటలకు చంద్రబాబు నివాసం వద్ద శిబిరంలో బస

ప్రభుత్వ నర్సింగ్ విద్యార్థులకు శాశ్వత భవనం నిర్మించాలి

ప్రజాశక్తి - గుంటూరు

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి అనుబంధంగా ఉన్న జిఎన్ఎమ్ నర్సింగ్ పాఠశాలకు శాశ్వత భవనం కట్టించాలని ఏపీఎన్ఎస్ఎస్ ఏపీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి విక్టోరియా కోరారు. ఈ మేరకు గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని బుధవా రం ఇచ్చారు. ఏపీఎన్ఎస్ఎస్ ముఖ్య సలహాదారులు శేషాద్రి భాస్కరరావు మాట్లాడుతూ నర్సింగ్ విద్యార్థులకు భద్రత లేకుండా ప్రస్తుతం ఓపి బిల్డింగ్‌పైన రేకుల షెడ్‌లలో ఉంటు న్నారని, నాట్కో బిల్డింగ్ పక్కన నర్సింగ్ పాఠశాల కోసం స్థలం కేటాయించారని చెప్పారు. రూ.10 కోట్లతో నర్సింగ్ పాఠశాల నిర్మించడం కోసం ప్రతిపాదనా సిద్ధంగా ఉందని, అధికారులు ఇప్పటికైనా స్పందించి నర్సింగ్ పాఠశాల నిర్మించాలని కోరారు. స్వచ్ఛంద ప్రసాద్ మాట్లాడుతూ బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు శాశ్వత భవనాన్ని నిర్మించినట్టే జిఎన్ఎమ్ నర్సింగ్ విద్యార్థులకు కూడా ప్రభుత్వాసుపత్రి పరిధిలో నర్సింగ్ పాఠశాల కేటాయించిన స్థలంలో బహుళ అంతస్తుల బిల్డింగును నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ సంక్షేమ సంఘం కోశాధికారి ఆదినారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ నర్సింగ్ విద్యార్థులకు శాశ్వత భవనం నిర్మించాలి

ప్రజాశక్తి-గుంటూరు

పదవుల కన్నా ప్రజల అభిమానమే మిన్న' అని, ప్రజల నాడి తెలిసిన వ్యక్తి గౌతు లచ్చన్న అని గుంటూరు తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా కొనియాడారు. గౌతు లచ్చన్న 115వ జయంతి సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఉన్న లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీకాకుళం ఖ్యాతిని నలుదిశలా చాటిన స్వాతంత్ర్య పోరాట యోధుడు గౌతు లచ్చన్న అని ప్రశంసించారు.

అభివృద్ధి పనులు తీసికట్టు!

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయ వివాదాల నడుమ మూణ్ణెల్లుగా అదిగో..ఇదిగో అంటూ వాయిదా వేస్తున్నారు. పి.వి.కె.నాయుడు కూరగాయల మార్కెట్ నూతన భవన నిర్మాణ సముదాయం నిర్మాణానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. రూ.163.61 కోట్ల అంచనాలతో నిర్మించనున్న ఈ పనులకు టెండర్లు ఖరారు కాలేదు. నాలుగున్నరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూగర్భ డ్రెయినేజి పథకం పనులపై కదలిక లేదు. రూ.903.82 కోట్లతో టిడిపి ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఈ పనులు దాదాపు 55 శాతం పూర్తయ్యాయి. కాంట్రాక్టు సంస్థకు రూ.420.44 కోట్లు చెల్లించామని, ఇంకా రూ.55 కోట్లు చెల్లించాల్సి ఉందని, చేసిన పనులకు సంబంధించి రూ.55 కోట్లు చెల్లిస్తేనే పనులు చేపడతామని కాంట్రాక్టు సంస్థ చెబుతున్నట్లు ప్రజారోగ్య శాఖాధికారులు తెలిపారు. బృందావన్ గార్డెన్స్ రూ.2.70 కోట్లతో అసంపూర్తిగా నిర్మించిన నార్ల తాతారావు ఆడిటోరియం నిరుపయోగంగా మారింది. ఐదేళ్లుగా ఈ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఆడిటోరియం నిర్మాణం పూర్తి చేయాలంటే ఇంకా రూ.10 కోట్లు అవసరమని, అన్ని నిధులు అందుబాటులో లేవని అధికారులు చెబుతున్నారు. కృష్ణనగర్‌లో మోడల్ రైతు బజారు ఏర్పాటుకు 2200 గజాల స్థలాన్ని మార్కెటింగ్ శాఖకు కేటాయించినా రైతు బజారును నిర్మించలేదు. అదేస్థలంలో కొనసాగుతున్న మార్కెట్‌లో కనీస సదుపాయాలు లేవు. మరోవైపు రైతులు, వ్యాపారుల నుంచి మార్కెటింగ్ శాఖ భారీగా అద్దెలు వసూలు చేస్తున్నారు. మార్కెటింగ్, మునిసిపల్ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల రైతు బజారుకు వచ్చే విక్రయ, వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో 133 నోటిఫైడ్ పేద వాడలున్నాయి. వీటి అభ్యున్నతికి నాలుగేళ్లుగా నిధులేమీ రావడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మౌలిక సదుపాయాల కల్పన నిధులు విడుదల కాలేదని నగరపాలక సంస్థ అధికారులు తెలిపారు. మహాత్మాగాంధీ ఇన్నర్‌రింగ్ రోడ్డు విస్తరణ పనులు పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు ప్రారంభోత్సవం జరిగింది. తరువాత మూడో దశ పనులు చేపట్టాలని ప్రతిపాదించినా పనులు చేపట్ట లేదు. ఈ రహదారి వెంబడి నివశిస్తున్న వారికి నష్టపరిహారం చెల్లించడంలో జాప్యం వల్ల పనులు జరగడం లేదని అధికారులు చెబుతున్నారు. గుంటూరులో ఆర్‌యూబిలు, ఆర్‌వోబిల నిర్మాణ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. చెత్తసేకరణకు వెయ్యి ఇళ్లకు ఒక ఈ-ఆటో చొప్పున 220 ఈ- ఆటోలు ప్రవేశపెట్టిన కొద్ది కాలానికి కొన్ని వాహనాలు మూలన పడ్డాయి. కొన్ని వార్డుల్లో 63 పాత వాహనాలు ఉపయోగిస్తున్నారు. కొన్ని వార్డులో ఎక్కడ చెత్త అక్కడ పేరుకుపోతోంది. నూతన కౌన్సిల్ ఏర్పడిన తరువాత రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, ప్రజా ప్రతినిధులు చెబుతున్నా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులు మాత్రం చేపట్టలేకపోతున్నారు.

వినుకొండలో భారీ చోరీ

రూ.30 లక్షలు విలువ చేసే సెల్ ఫోన్లు అపహరణ

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ పట్టణంలోని కొత్తపేట లాయర్స్ స్ట్రీట్ కింగ్ మొబైల్స్ (ఒప్పో) లో చోరీ జరిగింది. యజమాని కొత్త మాసు గురు ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం అర్ధరాత్రి షాపులో దొంగలు పడి సుమారు 25 లక్షలు విలువచేసే సుమారు 100కు పైగా సెల్ఫోన్లను అపహరించినట్లు తెలిపారు. షాపు షట్టర్ కు వేసిన తాళాలను వేసి నట్లే ఉంచి షట్టర్ను వంచి ధ్వంసం చేసి దొంగలు షాపులో ప్రవేశించినట్లు సిసి ఫుటేజ్ ఆధారంగా తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన ప్రాంతాన్ని చేరుకొని షాపులో సీసీ ఫోటేజీలను పరిశీలించగా నలుగురు దొంగలు షట్టర్ని పగలగొట్టి గోతాలతో లోపలికి ప్రవేశించి విలువైన సెల్ ఫోన్లోను దొంగిలించినట్లు తెలిపారు. పట్టణ నడిబడ్డు, వ్యాపార సముదాయాలు కలిగిన కలిగీ,

వినుకొండలో చోరీ జరిగిన సెల్‌ఫోన్‌ల దుకాణం

జనసంచారం కలిగిన ప్రాంతం, శాసనసభ్యులు నివాస ప్రాంతం , లాయర్స్ స్ట్రీట్, ప్రతి షాపుకు సీసీ కెమెరాలు పర్యవేక్షణలో ఉన్న ఏరియా అటు పోలీస్ స్టేషన్కు, ప్రధాన జాతీయ రహదారికి కోత వేటిలో ఉన్నటువంటి ప్రాంతంలో అర్ధరాత్రి దొంగలు సెల్ఫోన్ షాపు షట్టర్ ను ధ్వంసం చేసి లక్షల విలువచేసే సెల్ ఫోన్లు అపహరించకపోవడం పట్టణంలో చర్చా నియాంశంగా మారింది. సీసీ కెమెరాల నిఘా వలయాలను బేకాతరు చేయకుండా జరిగిన దొంగతనం పోలీసులకు సవాల్ గా మారింది. కింగ్ మొబైల్ షాప్ లో చోరీకి పాల్పడిన దొంగలు సిసి ఫుటేజ్ ఆధారంగా పరిశీలిస్తే హిందీలో మాట్లాడుకుంటూ గోతాల్లో సెల్ఫోన్లను నింపి దొంగిలిచ్చినట్లు బాధితుడు తెలిపారు. సమాచారం తెలుసుకున్న వినుకొండ సీఐ సాంబశివరావు సంఘటన ప్రాంతానికి చేరుకొని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

గుంటూరు నుండి వేలిముద్రల సేకరణ బందం రంగప్రవేశం చేసి మొబైల్ షాప్ లో వేలిముద్రలు సేకరించారు. షాప్ యజమాని కొత్త మాసు గురు ప్రసాద్ ఫిర్యాదు మేరకు వినుకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు

ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణంలోని నులపేట వద్ద బైక్‌ను కారు ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఓ యువకుడికి రెండు కాళ్ల తెగిపోయాయి. మరోయువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సంఘటన చూసి కారులో ఉన్న వ్యక్తులు పరారయ్యారు. తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రులను మంగళగిరిలోని ఆసుపత్రికి తరలించారు.

పొంచి ఉన్న ప్రమాదం!

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పట్టణంలోని ముబారక్ నగర్, ఎస్‌పిపి రోడ్డులోని చౌరస్తాలోని ఇనుప చట్ట చాలా సన్నగా, తుప్పు పట్టి ఉన్న కారణంగా అది ఏ సమయంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉంది. రోడ్డు విస్తరణలో భాగంగా ట్రాఫిక్ మళ్లిస్తుండటంతో ద్వి చక్ర, నాలుగు చక్రాల వాహనాలతో పాటు ఇతర పెద్ద వాహ నాలు అటుగా వెళ్లే సమయంలో ఆ చట్ట ఏ సమయంలో నైనా కూలిపోవచ్చని వాహన చోదకులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పొన్నూరు పట్టణ అబివృద్ధి కమిటి కన్వీనర్ షేక్ యాసిన్ బాబా కోరారు.

గోవా మద్యం పట్టివేత

30 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - వినుకొండ

గోవా నుండి అక్రమంగా మద్యం దిగు మతి చేసుకొని విక్ర యిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సెబ్ సి విజయభాస్కర్ రావు బుధవారం తెలిపారు. సబ్ పలనాడు జిల్లా జాయింట్ డైరె క్టర్ ఆదేశాల మేరకు వినుకొండలో దాడులు నిర్వహించడం జరిగిందన్నారు. శావలాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన మండధి వెంకట శివ నాగేశ్వరరావు అనే వ్యక్తి గోవా రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం తీసుకువచ్చి వినుకొండ పట్టణంలో విక్రయిస్తుండగా స్థానిక ఏనుగుపాలెం రోడ్ లోని మార్కెట్ యార్డు వద్ద అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు.750 ఎమ్మెల్ గల 16 రాయల్ స్టాగ్ బాటిల్స్, 180 ఎమ్ఎల్ మాన్ సన్ హౌస్ బ్రాందీ 8 బాటిళ్లు, క్లాసిక్ బ్లూ విస్కీ ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని అక్రమ మద్యం వికలాదారుడు శివ నాగేశ్వరరావు పై కేసు నమోదు చేసి వినుకొండ జూనియర్ సివిల్ జడ్జ్ ఎదుట హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - రెంటచింతల

ఎస్ ఈ బి స్టేషన్ గుర జాల పరిధిలోని మండలం లోని తుమ్రుకోట గ్రామం వద్ద బుధవారం ఉదయం అక్రమంగా తెలంగాణ మద్యాన్ని రవాణా చేస్తున్న కొత్త గంగరాజుపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 81 బాటిళ్ల తెలంగాణ మద్యం సీసాలను, వాటి రవాణాకు ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై మీద కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ ఈ బి స్టేషన్ గురజాల సబ్ ఇన్స్పెక్టర్ ఎం.జయరావు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది శ్రీనివాసరావు,మరియదాసు , సుదర్శన్, తేజ పాల్గొన్నారు.

ఫ్లెక్సీ చించివేత

ప్రజాశక్తి-తాడేపల్లి

నారా లోకేష్ యువగళం పాదయాత్రలో భాగంగా ఉండవల్లి సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని మంగళవారం రాత్రి ముగ్గురు యువకులు చించి వేశారు. వారిలో ఇద్దరు పారిపోయారు. ఒకరిని స్థానిక టిడిపి కార్యకర్తలు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు కేసు విచారిస్తున్నారు.

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న కత్తెర సురేష్ కుమార్

మందడంలో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని ప్రాంతం మందడం గ్రామంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా తాడికొండ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి గడపకు తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఇంకేమైనా సమస్యలు ఉంటే తమ దష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని చెప్పారు.ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు.మరోసారి వైసిపి ని ఆదరించాలని కోరారు.కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆలూరి శ్రీనివాసరావు,కొప్పుల శేషగిరిరావు పాల్గొన్నారు.

డాక్టర్ ఎన్ రత్న కిషోర్ ను సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవి నారాయణ

నూతన ఆవిష్కరణలకు కృషి చేయాలి

తిరుమల ఇంజినీరింగ్ విద్యార్థులతో ప్రొఫెసర్ ఎన్.రత్నకిషోర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నూతన ఆవిష్కరణకు ఇంజినీరింగ్ విద్యార్థులు కృషి చేయాలని, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆచార నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.రత్నకిషోర్ అన్నారు. మండలంలోని జొన్నలగడ్డ పరిధిలో గల తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసి) ఆధ్వర్యంలో పాఠశాల కమ్యూనిటీ లక్ష్యాలను చేరుకోవడానికి ఇన్నోవేషన్ మరియు ఎంటర్‌ప్రెన్యూర్షిప్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.రత్నకిషోర్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు బృందంగా ఏర్పడి విషయాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, లక్ష్యాలను సాధించడంలో సాంకేతికతను అదింపుచ్చుకోవడంలో కొత్త విధానాలు ఏ విధంగా దోహదం చేస్తాయో విపులంగా వివరించారు. పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి సాంకేతికత నైపుణ్యం ఎంతో అవసరమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవి నారాయణ మాట్లాడుతూ సాంకేతిక విద్య అవసరాన్ని, విద్యార్థుల పురోభివృద్ధికి ఉపకరించే తీరును వివరించారు. మరికొన్ని అంశాలపై సీనియర్ ఎంబీఏ అధ్యాపకులు పిడిఆర్ మూర్తి, సిహెచ్ నాగేశ్వరరావు వివరించారు.

మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 40,484
మిర్చి ఎగుమతి	: 41,997
మిర్చి నిల్వ	: 10,370

మిర్చి ధరలు

	రూపాయలలో
334	10,000 - 23,500
నెం.5	11,500 -18,000
273	13,000 - 23,000
341	9,000 - 22,500
సూపర్10	18,000 - 23,000
	నాన్ ఎసి
తేజ	9,500 - 24,500
బడిగి	12,500 - 25,000
దేవనూరు డీలక్స్	18,800 - 20,000
తాలుకాయలు	5,000 -14,500
	ఎసి
334	13,500 - 24,200
నెం.5	16,000 - 16,000
341	9,000 - 23,500
4884	12,000 - 20,500
తేజ	10,500 - 24,500
బడిగి	10,000 - 24,500
తాలుకాయలు	6,000 -13,500

పాస్‌పోర్టు పోయినది

పాపిశెట్టి వెంకటేష్. తండ్రి ప్రభాకర్ (లేటు), డోర్ నెం.16-8-65, బ్రహ్మంగారిగుడి వద్ద, వడ్డవల్లి, సత్తెనపల్లి, పల్నాడుజిల్లా. పాస్‌పోర్టు నెం.**M2652941** జిరాక్స్ నిమిత్తం ఇంటి నుండి జిరాక్స్ తీయించుకునేందుకు వెళుతుండగా పోయినది. వెతికినా దొరకలేదు. దొరికినవారు తెలియజేయగలరు.

పాపిశెట్టి వెంకటేష్,
వడ్డవల్లి, సత్తెనపల్లి,
సెల్ నెం.9858585663.

In The Court Of The Hon'ble Addl. Senior Civil Judge :: Eluru
O.S.No. 161/2016

Between:
Sri Dasi Devasahayam @ Venkateswara Rao ***...Plaintiff***
AND
Sri Dasi Manshey and 3 Others ***...Defendants***

పై నెంబరు దావాలో 4వ డిఫెండెంటు అయిన శ్రీమతి Dasi @ Maddi Navya, W/o. Maddi Shiva Shankar, D/o. Late Manashey, R/o. D.No. 8-957, Perusubramanyam Enclave, Thumalla Apparao Street, Medikondur Mandal, Perecherla Post, Guntur Dist, Guntur JCJ, Pin-522009 అనువారికి సమన్లు అమలు కొరకు **ది.18-08-2023న వాయిదా అయి ఉన్నది. సదరు వాయిదా రోజు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని ఉదయం గం॥ 10:30 ని॥లకు వచ్చి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను.** లేని ఎడల వారి పరోక్షమందు సంగతులు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
ఈడ్పుగంటి శ్రీనివాసబాబు
ఏలూరు, అడ్వకేట్, ఏలూరు.
1-8-2023. ఫోన్: 08812-239498

రేషన్ బియ్యంపై అపోహలను వీడండి

- రక్తహీనతను అరికట్టే ఫోర్టిఫైడ్ బియ్యంలో ఎన్నో పోషకాలు
- అన్నంతోపాటు ఇతర వంటకాలూ చేసుకోవచ్చు
- వంటల పోటీల్లో పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఎమ్‌డియు వాహనాల ద్వారా రేషన్ కార్డుదారులకు ఇంటి వద్దకే అందిస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యాన్ని లబ్ధిదారులు ఆహారం రూపంలో కచ్చితంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జెసి ఎ.శ్యామ్‌ప్రసాద్ సూచించారు. ఫోర్టిఫైడ్ బియ్యంతో వంటకాల తయారీ పోటీలను కలెక్టరేట్ ప్రాంగణంలో బుధవారం నిర్వహించగా పోటీలను జెసితో కలిసి కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. ఐరన్, విటమిన్ బి12, ఫోలిక్ యాసిడ్ కూడిన బియ్యాన్ని గురించి వాస్తవాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి రేషన్ బియ్యం పట్ల ఉన్న అపోహలను తొలగించాలన్నారు. జిల్లాలో 10 మండల స్థాయి నిల్వ కేంద్రాల నుండి 1290 రేషన్ షాపులకు సరుకులు చేరవేయగా 402 ఎమ్‌డియు వాహనాల ద్వారా ఇంటింటికి పంపిణీ చేస్తున్నమన్నారు. జాతీయ ఆహార భద్రత చట్టం, రాష్ట్ర రేషన్ కార్డులు కింద నెలకు 9096.365 టన్నుల బియ్యం పంపిణీ

స్టాల్స్‌లో తయారు చేసిన వంటకాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్

చేస్తున్నట్లు తెలిపారు. కిలో బియ్యంపై రాయితీగా దాదాపు రూ.39.35 చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తున్నాయన్నారు. మహిళలు, పిల్లల్లోని పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు, నాడీ వ్యవస్థ పని తీరు మెరుగుపడేందుకు ఈ ఫోర్టిఫైడ్ బియ్యం దోహదం చేస్తాయని వివరించారు. వీటిని ఇతరులకు అమ్మకుండా ఇంట్లోనే వండుకుని తినాలని కోరారు. జెసి మాట్లాడుతూ ఈ బియ్యాన్ని ఉడికించేందుకు ప్రత్యేక విధానాలు అవసరం లేదని, సాధారణ బియ్యం ఉడికించినట్లే ఉడికించి వంట చేసుకోవచ్చని చెప్పారు. అన్నం లేదా ఇతర వంటకాలలైనా ఈ బియ్యంతో చేసుకోవచ్చని అన్నారు.

ఇదిలా ఉండగా వంటల పోటీల్లో ప్రతిభ చాటిన వారికి మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతిని ఎం.భూలక్ష్మి (మెప్మా) సాధించగా మిక్సి గ్రైండర్‌ను అందించారు. రెండో మెప్మా, రెండవ బహుమతి నర్మద (ఐసిడిఎస్) సాధించగా ఎలక్ట్రికల్ కుక్కర్, మూడో బహుమతిని సాధించిన శేషమ్మ (డిఆర్‌డిఎ)కు డిన్నర్ సెట్‌ను బహూకరించారు. పోటీల్లో పాల్గొన్న మరో 37 మందికి కన్సోలేషన్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరా శాఖ అధికారి ఎస్.పద్మశ్రీ, ఏపీఎస్‌సీఎస్సీ డిఎం వరలక్ష్మి, ఐసిడిఎస్ పీడీ బి.అరుణ, డిఆర్‌డిఎ, మెప్మా పీడీలు బాలునాయక్, వెంకటనారాయణ పాల్గొన్నారు.

సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలలో కార్పొరేట్ తరహాలో దంతవైద్య సేవలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

స్థానిక ఏరియా వైద్యశాలలో దంత చికిత్సలో కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులో ఉందని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో దంత సమస్యలకు సంబంధించి పిప్పళ్లు తీయటం, సిమెంట్ వేయటం లాంటి సౌకర్యాలకు అందుబాటులో ఉండగా ఇప్పుడు కొత్త పళ్లు కట్టుట, అమర్చటం వంటి సేవలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రోగులు బయట వైద్యశాలకు వెళ్లి వేలాది రూపాయిలు ఖర్చు చేయాల్సిన అవసరం లేదని, మంత్రి అంబటి రాంబాబు ప్రత్యేక చొరవతో ఆస్పత్రిని అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు.

ఈ-క్రాప్ నమోదులో వ్యవసాయ సిబ్బంది

ఈ-క్రాప్ నమోదుతో రైతులకు ఉపయోగం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

మండలంలోని నందిగామలో పొలాలను మండల వ్యవసాయ అధికారులు బుధవారం పరిశీలించారు. ఈ-క్రాప్ నమోదు తీరును ఏవో ఎస్.శ్రీధర్‌రెడ్డి తనిఖీ చేసిన అనంతరం మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదు వల్ల రైతులకు ఎంతో ఉపయోగమన్నారు. పంటను మద్దతు ధరకు ప్రభుత్వానికి అమ్ముకోవాలన్నా, పంట రుణాలు పొందాలన్నా, పంటల బీమా వర్తించాలన్నా, నష్టపరిహారాలు దక్కాలన్నా ఈ-క్రాప్ ఉన్న రైతులకే వర్తిస్తుందని వివరించారు. రైతులంతా తాము సాగుచేసే పంటల వివరాలను స్థానిక రైతు భరోసా కేంద్రం వద్దకు వెళ్లి నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు గోపాలం, గోపికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

అవార్డును అందుకుంటున్న సాగర్, కోటేశ్వరరావు, బుల్లిబాబు

ముగ్గురికి ఉత్తమ సేవా పురస్కారాలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకుగాను సత్తెనపల్లికి చెందిన ఇద్దరికి అవార్డులు దక్కాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో మంగళవారం నిర్వహించిన వేడుకల్లో అవార్డులను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కారుమూరు వెంకట నాగేశ్వరరావు నుండి అందుకున్నారు. అవార్డులు అందుకున్న వారిలో మున్సిపల్ ఎఇ సాగర్, రూరల్ సిఐ సిహెచ్ కోటేశ్వరరావు ఉన్నారు. ఇదిలా ఉండగా సత్తెనపల్లి పట్టణ కేంద్రంగా ఏర్పాటు చేసిన హెల్ప్ ఫౌండేషన్ నిర్వహించిన అనేక సేవా కార్యక్రమాలకుగాను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఉత్తమ స్వచ్ఛంద సేవా సంస్థ అవార్డును సంస్థ అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబుకు ప్రదానం చేశారు.

రోబోను తయారు చేసిన జెడ్‌పి విద్యార్థులు

ప్రజాశక్తి - పెదకూరపాడు

శ్రీరేయినా టెక్నాలజీస్ ఆధ్వర్యంలో రోబోటిక్స్, కోడింగ్ ప్రోగ్రాంకు సంబంధించిన వర్కుషాప్‌ను మండలంలోని తాళ్లూరు జెడ్‌పి పాఠశాలలో బుధవారం నిర్వహించారు. టేబుల్ ఫ్యాన్, ఎలక్ట్రానిక్ అలారం, వైర్ గేమ్ లాంటి పరికరాలను విద్యార్థులు తయారు చేశారు. వైర్‌తో నడిచే రోబోను తయారు చేసి దానిద్వారా ఫుట్ బాల్ గేమ్ ఆడారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు నూతన సాంకేతికతను పరిచయం చేస్తాయని, వారిలో సృజనాత్మకతను, ఆలోచనా శక్తిని ప్రేరేపిస్తున్నదని శ్రీరేయినా టెక్నాలజీస్ చైర్మన్ ఎన్.శ్రీనివాసరెడ్డి చెప్పారు. విద్యార్థులు సైన్స్, సాంకేతిక రంగాల్లో తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవటానికి ఉపయోగపడుతుందన్నారు. పలు అంశాలపై విద్యార్థులకు ఎం.శ్రీకాంత్, అమరనాథ్‌రెడ్డి, పవన్, నితిన్, కార్తికేయ, పూజ వివరించగా ఎంఇఒ సత్యనారాయణ, హెచ్‌ఎం ఎ.శ్రీనివాసరెడ్డి, పిసి చైర్మన్ జీ.శ్రీనివాసరెడ్డి, ఇ.కోటిరెడ్డి పాల్గొన్నారు.

ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్, జెసి

అర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని జిల్లా స్పోర్ట్ అథారిటీ ప్రాంగణంలో ఈనెల 20వ తేదీ నుండి 26 వ తేదీ వరకు నిర్వహించే ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ బుధవారం పరిశీలించారు. ర్యాలీ కోసం వస్తున్న అభ్యర్థులకు వసతుల కల్పనలో ఎక్కడా ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. పరిశీలనలో జెసి శ్యామ్ ప్రసాద్, కల్నల్ పునీత్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

జూడో పోటీల్లో పల్నాడు క్రీడాకారులకు పతకాలు

జాతీయ స్థాయి పోటీలకు ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నెల్లూరులోని జీసస్ సెంటర్ నందు ఈనెల 12-15 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్, సీనియర్ బాల, బాలికల జుడో పోటీల్లో పల్నాడు జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ చూపి పతకాలు సాధించారని జూడో అసోసియేషన్ పల్నాడు జిల్లా కార్యదర్శి జి.సాయిరాం తెలిపారు. ఈ పోటీల్లో 22 జిల్లాలకు చెందిన క్రీడాకారులు తలపడగా జూనియర్ బాలుర 90 కిలోల విభాగంలో షేక్ మస్తాన్‌వలి ప్రథమ స్థానం, 55 కిలోల విభాగంలో సిహెచ్ కొర్నెల్‌బాబు ద్వితీయ స్థానం, 80 కిలోల విభాగంలో ఎ.ఆనంద్ సృజన్ తృతీయ స్థానం సాధించారని తెలిపారు. జూనియర్ బాలికలు 63 కిలోల విభాగంలో తృతీయ స్థానం, సీనియర్ బాలికల విభాగం ఓపెన్ వైట్ కేటగిరిలో ఎస్.శిరీష ప్రథమ స్థానం, 57 కిలోల విభాగంలో మధుమతి తృతీయ స్థానం, సీనియర్ బాలురు 55 కిలోల విభాగంలో ఎస్.నాగేంద్రబాబు తృతీయ స్థానం సాధించారని వివరించారు. ఇదిలా ఉండగా జాతీయ స్థాయి పోటీలకు పల్నాడు జిల్లా నుండి ఇద్దరు ఎంపికైనట్లు తెలిపారు.నరసరావుపేటకు చెందిన షేక్ మస్తాన్ జూనియర్ బాలుర జట్టుకు, ఎన్.శిరీష సీనియర్ బాలికల జూడో జట్టుకు ఎంపికైనట్లు వెల్లడించారు. ఈనెల 28

క్రీడాకారులను అభినందిస్తున్న మాజీ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి

నుండి వచ్చేనెల 1వ తేదీ వరకు న్యూఢిల్లీలోని ఐజి స్టేడియం కాంప్లెక్స్‌లో నిర్వహించే జూనియర్ జాతీయ స్థాయి జూడో పోటీల్లో షేక్ మస్తాన్, అక్టోబర్ 1 - 5 తేదీల్లో రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో న్విహించే సీనియర్ జాతీయ స్థాయి జూడో పోటీల్లో శిరీష పాల్గొంటారని తెలిపారు. వీరిని పల్నాడు జిల్లా జుడో అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ ఎస్‌ఎం కమల్‌బాషా, సీఈఓ పి.రాంబాబు, ట్రెజరర్ షేక్ సుభాని, కోచ్ ఒ.శివకృష్ణ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో పిహెచ్‌సి ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - మాచర్ల

వెల్దుర్తి మండలం ఉప్పలపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె.శ్రీనివాసరావు (45) బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మధ్యాహ్నం ఉప్పలపాడు నుండి మాచర్ల వస్తుండగా ద్విచక్ర వాహనాన్ని మండాది సమీపంలోని రచ్చమల్లపాడు రోడ్డు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో శ్రీనివాసరావు మృతి చెందారు. ఏలూరు ప్రాంతానికి చెందిన శ్రీనివాసరావు ఏడాది క్రితం బదిలీపై ఈ ప్రాంతానికి వచ్చారు. శ్రీనివాసరావు కుటుంబం విజయవాడలో ఉంటుండగా ఆయన మాత్రం మాచర్లలో అద్దె ఇంట్లో ఉంటూ రోజు ఉప్పలపాడుకు వెళ్లి వస్తున్నారు. మృతునికి భార్య, ఐదేళ్ల కుమారుడు ఉన్నారు. శ్రీనివాసరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించి సమాచారాన్ని కుటుంబీకులకు అందించారు. వెల్దుర్తి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజకీయ పార్టీలతో కలెక్టర్ సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు :జిల్లాలో ఎస్-ఎస్ఆర్-2024లో సంబంధించి ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితా రూపొందించేందుకు ఇంటింటికీ ఓటరు కార్డు వెరిఫికేషన్ ప్రక్రియ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం రాజకీయ పార్టీల భాగస్వామ్యంతో పారదర్శకంగా జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం.వేణు గోపాల్‌రెడ్డి, జెసీ జి.రాజకుమారి, నగర కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ, డిఆర్ఒ కె.చంద్రశేఖర్‌రావుతో కలిసి ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్-2024లో ఇంటింటికీ ఓటరు కార్డుల వెరిఫికేషన్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆప్ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టరు టి.సేవాకుమార్, బిఎస్‌పి నాయకులు సిహెచ్.వాసు, బిజెపి నుండి రాచుమల్లు భాస్కరరావు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బిళ్లా సునీల్, టిడిపి కార్యాలయ సెక్రెటరీ కె.శివరామయ్య, వైసిపి రాష్ట్ర కార్యదర్శి అత్తోట జోసఫ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎస్-ఎస్ఆర్-2024 ప్రక్రియకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతివారం నిర్వహించే సమావేశంలో ఇంటింటికీ జరుగుతున్న ఓటరు కార్డుల వెరిఫికేషన్ ప్రక్రియ పురోగతి, స్వీకరించిన దరఖాస్తుల పూర్తి సమాచారం జిల్లా స్థాయిలోను, నియోజకవర్గ స్థాయిలోను అందిస్తున్నా మన్నారు. ఓటరు జాబితాకు, ఇంటింటికి ఓటరు కార్డుల వెరిఫికేషన్‌కు సంబంధించి రాజకీపార్టీలు తెలిపిన అంశాలను వెంటనే అధికారులతో క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కారంకు చర్యలు తీసుకుంటున్నా మన్నారు. ఓటరు కార్డు వెరిఫికేషన్ సమయంలోనే కుటుంబంలోని ఓటర్లకు సంబంధించిన పూర్తి వివరాలతోపాటు, అర్హత ఉన్న వారికి ఓటు నమోదుకు ధరఖాస్తులు, మార్పులు, చేర్పులకు దరఖాస్తులు, తొలగింపునకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించేలా ఏఈఆర్వోలు, ఈఆర్వోలు బీఎల్వోలతో నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు. నూతన ఓట్లు చేర్పులు, తోలగింపులు, ఓటరు కార్డులో సవరణలు ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారమే దరఖాస్తులు చేయించి వెరిఫికేషన్ చేసి చర్యలు తీసుకోవాలని ఈఆర్వోలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. ఇంటింటికీ ఓటరు కార్డుల వెరిఫికేషన్ ప్రక్రియ నూరుశాతం నిర్దేశిత సమయానికి పూర్తి అయ్యేలా ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఓటు హక్కుకోసం 18 సంవత్స రాలు వయస్సు నిండిన వారితో పాటు, ముందస్తుగా ఓటు కోసం 17 సంవత్సరాలు వయస్సు నిండిన వారు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నందున దీనిపై అధికారులతో పాటు, రాజకీయపార్టీలు ప్రజలకు విస్తత స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఈఆర్వోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లలితా, వెంకటశివరామిరెడ్డి, ఆర్డీవో ప్రభాకర్ రెడ్డి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్ది రోజ పాల్గొన్నారు.

బుర్రిపాలెం సర్పంచ్, హాఫ్‌పేట వార్డు మెంబర్ పదవులకు

19న ఉపఎన్నికలకు కమిషన్ ఆదేశాలు

బుర్రిపాలెం సర్పంచ్ బరిలో ఐదుగురు - పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డీఎస్పీ జనార్ధనరావు

బుర్రిపాలెంలో పోలింగ్‌బూత్‌ను పరిశీలిస్తున్న డిఎస్పీ

ప్రజాశక్తి-తెనాలి

గ్రామపంచాయతీల్లో కాళీ అయిన సర్పంచ్, వార్డు సభ్యుల ఉప ఎన్నికకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నామినేషన్ల ఘట్టం ముగిసింది. మండలంలో రూరల్ గ్రామం బుర్రిపాలెం సర్పంచ్ పెమ్మసాని పురుషోత్తం అనారోగ్యంగో మృతి చెందారు. అలాగే హాఫ్‌పేట మూడవ వార్డు సభ్యుడు మృతి చెందాడు. ఈ నేపథ్యంలో బుర్రిపాలెం సర్పంచ్, హాఫ్‌పేట మూడవ వార్డుకు ఉప ఎన్నిక ఈనెల 19న జరుగనుంది. సర్పంచ్, వార్డు మెంబర్ ఉప ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్ధుల వివరాలు, వారికి కేటాయించిన ఎన్నికల గుర్తులను రిటర్నింగ్ అధికారి ఎం.వెంకటేశ్వరరావు వెల్లడించారు. బుర్రిపాలెం సర్పంచ్‌గా చందు శ్రీనివాసరావు (మంచం) పరుచూరి విజయలక్ష్మి (కత్తెర) శాఖమూరి చలపతిరావు(ఉంగరం) శాఖమూరి రవీంద్రబాబు(బుట్ట), శాఖమూరి వేణుగోపాలరావు(వంకాయ) పోటీలో ఉండగా, హాఫ్‌పేట మూడో వార్డుకు కోటిపల్లి నరశింహారావు (ప్రెషర్ కుక్కర్) వల్లూరు శివానందం (గౌను) పోటీలో ఉన్నారు. కాగా పోలింగ్ ఉదయం ఏడు గంటల నుంచి మద్యాహ్నం ఒంటిగంటల వరకు జరుగుతుందని, మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి ఉంటుందని రిటర్నింగ్ అధికారి వెల్లడించారు. 19న ఉప ఎన్నిక జరుగనున్న బుర్రిపాలెం గ్రామంలో డిఎస్పీ బి.జనార్ధనరావు బుధవారం పర్యటించారు. పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. పోటీలో ఉన్న అభ్యర్ధులు, ప్రచారం తదితర వివరాలను తెలుసుకున్నారు. అలాగే హాఫ్‌పేటలో పోలింగ్ బూత్‌లను రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభ్యర్ధులు ఎన్నికల నియమావళి పాటించాలన్నారు. ప్రచారానికి ఉపయోగించే వాహనాలకు ఖచ్చితంగా పోలీస్ అనుమతి పొందాలన్నారు. అలాగే ఉదయం ఆరు గంటల నుంచి పది గంటల వరకు మాత్రమే ప్రచారం నిర్వహించాలన్నారు. ఎన్నిక ప్రక్రియకు 48 గంటలు ముందుగా ప్రచారం నిలిపివేయాలని, అంటే గురువారం సాయంత్రం ప్రచార గడువు ముగుస్తుందని చెప్పారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సిపిఎం సభ్యుడు బుర్రయ్య కన్నుమూత

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

పెదవడ్లపూడి గ్రామ సిపిఎం సభ్యుడు యార్లగడ్డ బుర్రయ్య (52) గుండె పోటుతో మంగళవారం రాత్రి యన్ఆర్ఐ ఆసుపత్రిలో కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బుర్రయ్య యువజన రంగంలో చురుగ్గా పనిచేశారు. గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన కూలి పోరాటంలో, ఇళ్లస్థలాల పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. గ్రామంలో సిపిఎం అభివృద్ధికి కృషి చేశారు. ఆయన అంత్యక్రియలు బుధవారం ఉదయం నిర్వహించారు. అంత్యక్రియల్లో సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి, సిపిఎం పార్టీ పతాకాన్ని కప్పి నివాళులర్పించారు. సిపియం సీనియర్ నాయకులు జే. వి. రాఘవులు, మంగళగిరి మండల సిపియం నాయకులు మొసలి పకీరయ్య , జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య, జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు ఎం బాలాజీ , దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, దుగ్గిరాల మండల కమిటీ సభ్యులు యార్లగడ్డ బ్రహ్మేశ్వర రావు, మంగళగిరి పట్టణ కార్యదర్శి వై. కమలాకర్, స్థానిక సిపిఎం నాయకులు మాజీ యం.పి.టి.సి. చిట్టి బొమ్మ రామ సుబ్బయ్య, గామ సిపిఎం కార్యదర్శి. మోర్ల కోటిలింగం, పీతా రామకృష్ణ , నంబూద్రి , ఈడే రాంబాబు గ్రామ మాజీ సర్పంచి చిట్టి బొమ్మ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి విశేష కృషి

ఆర్థల సూర్యనారాయణ సంస్మరణ సభలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఆర్థల సూర్యనారాయణ ఆశయాలను లక్ష్యాలను కొనసాగించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పేర్కొన్నారు. మండలంలోని కాజా సిపిఎం కార్యాలయంలో జరిగిన సూర్యనారాయణ ఏడవ వర్ధంతి సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిపిఎం నాయకులు ఆళ్ల సాంబిరెడ్డి అధ్యక్షత వహించారు. రామారావు మాట్లాడుతూ గ్రామంలో 50 ఏళ్ల పాటు గ్రామ పంచాయతీని ఆదర్శంగా సిపిఎం ఆధ్వర్యంలో నడిపారని, గ్రామ అబివృద్ధి కోసం సూర్యనారాయణ ఎంతో కృషి చేశారని చెప్పారు. లాభాపేక్ష లేకుండా గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ, వంతెనల నిర్మాణం చేపట్టారన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక నిత్య అవసరాల ధరలను విపరీతంగా పెంచిందన్నారు. సామాన్యుల జీతాలు మాత్రం పెరగడం లేదని ఆకాశాన్ని అందుతున్న ధరలతో ఆర్థిక సంక్షోభంతో పేదల జీవితాలు దుర్భరంగా తయారవుతున్నాయన్నారు. లాభాలు అర్జించే ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతూ స్వ లాభాలు పొందుతున్నారని పేర్కొన్నారు. మణిపూర్ దారుణాలపై కేంద్రం స్పందించకపోవడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్రానికి నష్టాలు కలిగించిన బిజెపికి అధికార ప్రతిపక్షాలు బిజెపిని వ్యతిరేకించకపోవడం ఏమిటి అని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలు అమలు పరచకుండా, రాజధానికి నిధులు ఇవ్వకుండా, పోలవరం నిధులు ఇవ్వకుండా, కడప ఉక్కుకు సహకారం అందించకుండా ఉన్న బిజెపికి ఎందుకు వంత పాడుతున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యుత్ బిల్లులు విపరీతంగా పెంచారని ట్రూఅప్, సర్‌ఛార్జీల పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్నారని చెప్పారు. వీటన్నిటికీ వ్యతిరేకంగా పాలకులకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈనెల 30 నుండి సెప్టెంబర్ 4 వరకు ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈనెల 25వ తేదీన గుంటూరులో జరిగే సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈదా ప్రతాపరెడ్డి, తమ్మా ప్రసాద్ రెడ్డి, భీమిరెడ్డి కోటేశ్వరి, సత్యమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థల సూర్యనారాయణకు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న పాశం రామారావు తదితరులు

నేడు తాడేపల్లిలో యువగళం పాదయాత్ర

ప్రజాశక్తి-తాడేపల్లి

గురువారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి నారా లోకేష్ యువగళం పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు తెలిపారు. శర్మ దాభా దగ్గర నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. డోలాస్‌నగర్, నులకపేట, సాయిబాబా గుడి మీదుగా తాడేపల్లి మెయిన్ రోడ్డు నుంచి ఉండవల్లి సెంటర్, ఉండవల్లి గుహల వరకు పాదయాత్ర జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి శ్రేణులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. అక్కడ నుంచి అమరావతి కరకట్టపై గల తన నివాసానికి లోకేష్ చేరుకుంటారని తెలిపారు.

కార్డు విడుదల చేస్తున్న రమేష్ ఆస్పత్రి డిప్యూటీ మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ మమత తదితరులు

రమేష్ ఆస్పత్రిలో 'ఆరోగ్య భాగ్యం' కార్డుల విడుదల

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రమేష్ ఆస్పత్రి ప్రారంభించి 35 సంవత్సరాల పూర్తయిన సందర్భంగా పేద,మధ్య తరగతి ప్రజల కోసం 'ఆరోగ్య భాగ్యం' కార్డులు ప్రవేశపెడుతున్నామని డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మమత రాయపాటి తెలిపారు. 300 రూపాయల విలువ కలిగిన ఆరోగ్య భాగ్యం కార్డ్ ను నగర డిప్యూటీ మేయర్ షేక్ సజీల ఆవిష్కరించారు. గుంటూరులోని రమేష్ ఆస్పత్రి ప్రాంగణంలో బుధవారం ఆమె మీడియా ప్రతినిధులతో మాట్యాడుతూ వార్షికోత్సవ సందర్భంగా 'ఆరోగ్య భాగ్యం" అనే పథకం ద్వారా ఇన్ పేషెంట్ ఔట్ పేషెంట్ వైద్య సేవలపై 25 శాతం రాయితీలను అందించడానికి నిశ్చయించామని తెలియజేశారు. ఇందులో భాగంగా ఈ కార్డులను అందిస్తున్నామని రూ.300 చెల్లించి ఎవరైనా ఈకార్డులు పొందవచ్చునని తెలిపారు. విజయవాడ, గుంటూరు, ఒంగోలు తదితర ప్రాంతాల్లో ఆస్పత్రిని ఇప్పటికే విస్తరించామని తెలిపారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దేవానంద్ వివరిస్తూ ఆస్టర్ డి.ఎం.హెల్త్ కేర్ తో కలిసి రాష్ట్రంలో రాబోయే రెండు సంవత్సరాలలో మరో 800 పడకల సామర్థ్యంతో హాస్పిటల్ ను విస్తరిస్తున్నామని దానిలో ప్రధానంగా విజయవాడ నగరంలో400 పడకలతో క్రొత్త యూనిట్ ను క్యాన్సర్,ట్రాన్స్ ప్లాంట్ మల్టీ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలతో ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని గ్రూప్ లో ఉన్న గుంటూరు,ఒంగోలు విజయవాడ లో ఉన్న మూడు హాస్పిటల్స్‌లో క్యాన్సర్ వైద్య సేవలను త్వరలో అందుబాటులోనికి తీసుకు వచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలియజేశారు.వివిధ ప్రాంతాలలో ఐ సి యు, ఎమర్జెన్సీ రూమ్‌లో ఉన్న రోగులను అధునాతన కెమెరాలు,వైద్య పరికరాలతో 24 గంటలూ మానిటర్ చేయడానికి "క్లౌడ్ డాక్స్" అనే ప్రత్యేక సెంట్రల్ కమాండ్ స్టేషన్ ను అందుబాటులోనికి తీసుకువచ్చామని ఈ వ్యవస్థ ద్వారా టెలి ఐ సి యు,టెలి ఎమర్జెన్సీ రూమ్, టెలి అంబులెన్స్ వైద్య సేవలను రమేష్ హాస్పిటల్ క్లస్టర్ ఉన్న అన్ని హాస్పిటల్స్ కు అనుసంధానం చేయడం ద్వారా నాణ్యమైన వైద్య సర్వీసులు ఇన్ పేషంట్ రోగులకు అందిస్తున్నామని విజయవంతమైన ఈ విభాగం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ హాస్పిటల్స్ కూడా అవసరం అయిన వారికి ఈ సేవలను అందించడానికి నిర్ణయించామని తెలియజేశారు.5 జి నెట్ వర్క్ తో రోగిని అంబులెన్స్ లో నుంచే క్రిటికల్ కేర్ వైద్య నిపుణుల పర్యవేక్షణలో దారి పొడుగునా అత్యవసర వైద్యం అందించే విధంగా అధునాతనమైన నాలుగు అంబులెన్సులను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రూప్ బిజినెస్ హెడ్ డాక్టర్.వై. కార్తీక్ చౌదరి, షేక్ షౌకత్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిపోయిన వీధి కుక్కల దాడులు

ప్రజాశక్తి-రెంటచింతల

గ్రామీణ ప్రాంతాల్లో కుక్కల దాడులు పెరిగిపోయి ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు పశువర్ధక శాఖ అధికారులు వీధి కుక్కలకు పునరావాసం కేంద్రం వంటివి నిర్వహించే కార్యక్రమాలు ఏ గ్రామంలోనూ కనిపించడం లేదు వీధుల్లో శునకాల సంచారం ఇటీవల మరీ ఎక్కువైంది విద్యార్థులు వీధి కుక్కల సంచారంతో స్కూలుకు వెళ్లాలంటే భయపడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు తెలుపుతున్నారు వీధి కుక్కలు రాత్రి వేళల్లో లేగదూడలు పై కూడా దాడులు చేస్తున్నాయని పశువుల నిర్వాహకులు తెలుపుతున్నారు ఈ సంవత్సరం జనవరి నుంచి ఆగస్టు 15 వరకు కుక్క కాటుకు గురై ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందిన వారి సంఖ్య 285 మంది నమోదయింది ఇంకా మరి కొంతమంది ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందిన వారు ఉన్నారు సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవడం లేదు అని ఈ విమర్శలువస్తున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కష్ణారెడ్డి మాట్లాడుతూ శునకాల బారిన పడినవారు ముందుగా గాయాన్ని నీటితో శుభ్రం చేయడంతో పాటు గాయం పై అదే పనిగా ధారల నీటిని పోసి పి హెచ్ సి కి రావాలన్నారు అవగాహన లేని కొందరు జిల్లేడు పాలు పోయడం సరికాదన్నారు యాంటీ రాబిన్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయాలన్నారు.

దుప్పట్లు, దోమ తెరలు పంపిణీ

ప్రజాశక్తి - యడ్లపాడు

మండల కేంద్రమైన యడ్లపాడులోని ఆర్.సి.ఎమ్. చర్చి ఆవరణలో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 మంది వృద్ధులు, దివ్యాగుంలు, వితంతులకు దుప్పట్లు, దోమ తెరలు పంపిణీ చేశారు. అలాగే అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అమ్మ ఫౌండేషన్ అధ్యక్షురాలు కారసాల బుల్లెమ్మాయి మాట్లాడుతూ 2012 నుండి 11 ఏళ్లుగా ప్రతి ఏటా దాతల సాయంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెల్లప్రోలు సురేష్ కుమార్, జగ్గాపురం పాంచాయితి సెక్రెటరీ లక్ష్మి శ్రీనివాసరావు, అంకమ్మరావు, బాబు జగ్జీవన్ రామ్ ఫౌండేషన్ అధ్యక్షులు బందెల ప్రసాద్, ఎమ్మార్పీస్ మండల కార్యదర్శి కమలబాబు, సుబ్బు, అశోక్, పున్నారావు ఉన్నారు.

సాగునీరు విడుదల చేయండి

ప్రజాశక్తి-సత్తెనపల్లిటౌన్

నాగార్జున సాగర్ కుడి కాలువ ఆయకట్టు పరిధిలో వివిధ రకాల పంటలు ఎండి పోకుండా ప్రభుత్వం వెంటనే సాగునీరు విడుదల చేయాలని జై భీమ్ భారత్ పార్టీ (జేబీపీ) పల్నాడు జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టు నుండి జులై 15 నాటికీ సాగునీరు విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించి నెల దాటిన ఇంతవరకు నీరును విడుదల చేయలేదని పేర్కొన్నారు. ఆయకట్టు పరిధిలో మిరప, పత్తి, మొక్క జొన్న, బొప్పాయి తదితర వాణిజ్య పంటలతో పాటు వరి పంటలను రైతులు పండిస్తున్నారని తెలిపారు. వెంటనే సాగుకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు ఎం. సుధా కర్ రావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవాలి

జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఐ. మురళి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు,సూచనలు పాటించి వ్యవసాయాన్ని లాభ సాటిగా చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ. మురళి అన్నారు. నరసరావుపేట మండలం పెద్దరెడ్డిపాలెం రైతు భరోసా కేంద్రం పరిధిలో గల కేతిముక్కల అగ్రహారం గ్రామంలో రైతులు సాగు చేస్తున్న పత్తి ,సోయాబీన్ పంటలను బుధవారం ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, మరియు గుంటూరు లాం ఫారం పత్తి పంట ప్రధాన శాస్త్రవేత్త ఎం. సుధారాణి , పల్నాడు జిల్లా డిఏటిటి సెంటర్ శాస్త్రవేత్త జి.రమేష్, ఎఫ్.టి.సి డిడిఏ ఎం.శివ కుమారి, నరసరావుపేట ఏడిఏ పి.మస్తానమ్మ,రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త ఎం. సుధారాణి పత్తి పంట లో తామర పురుగు,రసం పీల్చే పురుగులు ఉన్నట్టు గుర్తించారు. నివారణకు పసుపురంగు,నీలి రంగు జిగురు అట్టలను పొలంలో ఉంచాలని సూచించారు. తామర పురుగు ఉధ్రుతి ఎక్కువగా ఉన్నట్లయితే నివారణకు రీజెంట్ 2 ఎం.ఎల్ ఒక లీటరు నీటికి లేదా వేప నూనె 1500 పిపిఎం 5 ఎం.ఎల్ ఒక లీటరు నీటికి పిచికారీ చేయాలని సూచించారు. గులాబీ రంగు పురుగు ఉధ్రుతిని అరికట్టేందుకు లింగాకర్షక బుట్టలను ఎకరానికి 10 నుండి 15 వరకు ఏర్పాటు చేయాలని సూచించారు. పొలం చుట్టూ పరిసరాలలో కలుపు మొక్కలు లేకుండా శుభ్రం చేసుకోవాలన్నారు. సోయాబీన్ లో తల మాడు ఉన్నట్లు గుర్తించి నివారణకు రీజెంట్ 2 ఎం.ఎల్ ఒక లీటరు నీటికి , లేదా అసెటమిప్రిడ్ ఒక లీటరు నీటికి 3 గ్రాములు చొప్పున పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కేతిముక్కల అగ్రహారం సర్పంచ్ దరువూరి బాబు, ఏ.ఈ.ఓ కె.బ్రహ్మయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు పి.పవన్ కుమార్, నాగరాజు నాయక్ రైతులు పాల్గొన్నారు.

కేతిముక్కల అగ్రహారంలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పారదర్శకంగా ఇంటింటికీ ఓటరు సర్వే

డిఆర్ఓ కె.వి.వినాయకం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో ఇంటింటికీ జరుగుతున్న ఓటరు సర్వేలో ఎటువంటి అభ్యంతరాలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని పల్నాడు జిల్లా డిఆర్వో కె.వినాయకం అన్నారు.బుధవారం పల్నాడు జిల్లా కలెక్టరేట్ లో వివిధ రాజకీయ పార్టీల నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు.

ఇంటింటికీ నిర్వహిస్తున్న ఓటరు సర్వే కార్య క్రమంపై వివిధ రాజకీయ పార్టీల నేతలతో చర్చించారు. అనంతరం పల్నాడు జిల్లా డిఆర్వో కె.వినాయకం మాట్లాడుతూ ఇంటింటికీ ఓటరు సర్వే విజయవంతమ య్యేందుకు స్థానిక ఓటర్లు,వివిధ రాజకీయ పార్టీ నేతలు బిల్వోలకు సహకరించాలని తెలిపారు.

రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న డిఆర్ఓ వినాయకం

సీనియర్ కార్యకర్తకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అమరావతి

అమరావతి మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న వైసిపి సీనియర్ కార్యకర్త కరీముల్లా కి నంబూరు శంకర్రావు ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. సోషల్ మీడియా కన్వీనర్ ఓబుల్ రెడ్డి ఆధ్వర్యంలో మండల ముస్లిం మైనార్టీ యూత్ లీడర్ ఆదర్శ ఆధ్వ ర్యంలో కరీముల్లా కు ఆర్థిక సహాయం అందించారు ఈ సందర్భంగా పార్టీ కోసం అహర్నిశలు పనిచేసే వారికి ఎమ్మెల్యే శంకరరావు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని షేక్ ఆదం షఫీ అన్నారు.

మానసిక ఒత్తిడి ఉన్న వారిలో అధిక శాతం షుగర్ వ్యాధి

డాక్టర్ యన్.శ్రీధర్ చంద్

ప్రజాశక్తి - అమరావతి

ఇప్పుడున్న పరిస్థితుల్లో షుగర్ వ్యాధి ఎక్కువ మందికి వచ్చే అవకాశాలు ఉన్నాయని డాక్టర్ శ్రీధర్ చంద్ అన్నారు పాత రోజుల్లో శారీరక శ్రమ ఎక్కువగా చేసేవారు మానసిక ఒత్తిడి తక్కువగా ఉండేదని అందువల్ల సైడ్ ఎఫెక్ట్స్ ఉండేవి కాదని డాక్టర్ శ్రీధర్ చంద్ అన్నారు కాలక్రమేణా శారీరక శ్రమ తగ్గుతూ వచ్చిందని శరీర వ్యాయామం తగ్గిపోయిందని ఎంబిబిఎస్, డిప్లమో ఇన్ డయాబెటిక్ డాక్టర్ శ్రీధర్ చంద్ అన్నారు. మానసిక ఒత్తిడి చాలా ఎక్కువగా ఉంటుందని అన్నారు. ఎక్కువగా షుగర్ రావడానికి గల కారణాలు శారీరక శ్రమ తీసుకోవడం మరియు మానసిక ఒత్తిడి ఎక్కువగా పెరిగిపోవడం వలన షుగర్ వ్యాధిన పడాల్సి వస్తుందని తెలిపారు.

ఆహార నియమాలు

షుగర్ వ్యాధి ఉన్నవారు ఆహారం ఒక్కసారిగా ఎక్కువ మోతాదులో తీసుకోవడం మంచిది కాదని సూచించారు తక్కువ మోతాదులో ప్రతి రెండు గంటల కు మూడు గంటలు ఒకసారి ఆహారం తీసుకోవాలని డాక్టర్ శ్రీధర్ చంద్ తెలిపారు. దీర్ఘకాలికంగా షుగర్ ఎక్కువగా ఉండటం వలన కంటి సమస్యలు గుండె సమస్యలు కిడ్నీ సమస్యలు వాటితో పాటు కాళ్లు తిమ్మిర్లు చేతి తిమ్మిర్లు ఇతర అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. ఏదైనా సమస్యలు వస్తే మరల పూర్వస్థితికి వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. కాబట్టి జాగ్రత్త పడాలని కోరారు. ఆహార అలవాట్లు మార్చుకొని వ్యాయామం ఎక్కువ చేయాలని అన్నారు. దగ్గర్లో ఉన్న షుగర్ వైద్య నిపుణులను సంప్ర దించి మందులు క్రమంగా వాడుకుంటే షుగర్ ని తగిన మోదాలో ఉంచుకోగలిగితే ఎటువంటి అనారోగ్య సమస్యలు రావని డాక్టర్ శ్రీధర్ చంద్ అన్నారు.

ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీకి ప్రజలు సహకరించాలి

- జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోకి 20 నుండి 26 వరకు సాధారణ ప్రజలకు ప్రవేశం నిషేధం
- జెసి శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట సత్తెనపల్లి రోడ్డులో గల జిల్లా క్రీడా ప్రాంగణంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరగనున్న ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీ సందర్భంగా సాధారణ ప్రజలను లోపలికి ప్రవేశం ఉండబోదని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుండి ఆర్మీ ఉద్యోగం కోసం అభ్యర్థులు రానున్న దష్ట్యా, నరసరావుపేట పట్టణ ప్రజలు పరిస్థితిని మంచి మనసుతో అర్థం చేసుకొని ఆగస్టు 20 నుండి 26 వరకు స్టేడియం లోపలికి రావద్దని పేర్కొన్నారు. ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీ నేపథ్యంలో అభ్యర్థుల ఎంపిక కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా జాయింట్ కలెక్టర్ వెల్లడించారు. ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీ కార్యక్రమం పూర్తయిన తర్వాత సాధారణ ప్రజలను జిల్లా క్రీడా ప్రాంగణం లోనికి అనుమతించడం జరుగుతుందన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

నేషనల్ మీన్స్-కం-మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష-2023కు రాష్ట్రంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 3న రాష్ట్రంలోని రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ఈ పరీక్ష ఉంటుందని, ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆదర్శపాఠశాలల్లో ఈ సంవత్సరం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. పరీక్ష రుసుం జనరల్, బిసి విద్యార్థులకు రూ.100లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50 ఆన్‌లైన్‌లో ఈ నెల 10వ తేదీ నుండి సెప్టెంబర్ 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పరీక్ష రుసుం చెల్లించటానికి సెప్టెంబర్ 16 ఆఖరు తేదీ అని, దరఖాస్తు అనంతరం ప్రింటెడ్ నామినల్ రోల్స్, ధృవపత్రాలు, సంబంధిత డిఇఒ కార్యాలయంలో సెప్టెంబర్ 19వ తేదీలోగా సమర్పించాలన్నారు.

పూర్తి వివరాల కోసం ప్రభుత్వ పరీక్షల సం చాలకుల కార్యాలయం వెబ్‌సైట్ www. bse. ap.gov.in లోగానీ, సంబంధిత డిఇఒ కార్యాలయంలో గానీ సంప్రదించాలని సూచించారు.

అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే సీరియస్

- ప్రభుత్వం నిధులు సకాలంలో ఇస్తోంది
- బిల్లులు చెల్లింపులో నిర్లక్ష్యం తగదు
- చేబ్రోలు మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

ప్రజాశక్తి - చేబ్రోలు

మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు కొక్కిలి గడ్డ సాహితీ కిరణ్ అధ్యక్షతన బుధవారం చేబ్రోలు మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు ప్రభుత్వం సమర్ధవంతంగా నిర్వహించడానికి అధికారుల పర్యవేక్షణ పనితీరు చాలా ముఖ్యమని అన్నారు. అభివృద్ధి పనుల నిర్వహణలో భాగమైన కాంట్రాకర్లు, బిల్డర్లకు బిల్లులు చెల్లించే విషయంలో అధికారుల పనితీరు వల్ల ఇబ్బందులు కలుగ కూడదని అన్నారు. ప్రభుత్వ నిధులు సకాలంలో ఇస్తున్న ప్పటికి అధికారుల పని నిర్లక్ష్యం వలన బిల్లులు చెల్లింపులో ఆలస్యం కావడం సబబు కాదని, ప్రజల ఉపయోగార్ధం చేసే అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా, వేగవంతంగా జరిగేలా తమ పని విధానాన్ని మార్చుకోవాలని హెచ్చరించారు. వ్యవసాయాన్ని మరింత సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డ్రోన్స్ వినియోగం వచ్చే నెల నుంచి మండలంలో ప్రారం భం కానున్న నేపథ్యంలో గ్రామా ల్లో ఆసక్తిగా ఉన్న యువతను ప్రోత్సహించి శిక్షణ ఇవ్వడం వల్ల మరింత ప్రయోజనం చేకూరి అవకాశం ఉందని మండల వ్యవసాయ అధికారికి సూచించారు. సమావేశంలో మండల పరిషత్ అబివృద్ధి అధికారి బి.బాబురావు, తహ శీల్దార్ కెవి గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసరావు , వేజెండ్ల సొసైటీ చైర్మన్ సిహెచ్ సాంబశివరావు, జిడిసిఎం ఎస్ కె.పాములు, మండల, గ్రామస్థాయి అధికారులు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

సమావేశం అనంతరం ఉత్తమ సేవా పురస్కారాలను పొందిన తహశీల్దార్ కె వి గోపాలకృష్ణ, ఎన్ఆర్ఇజిఎస్ ఎపిఎం ఆనందమోహన్, శలపాడు సచివాలయం సర్వేయర్ కవితలను ఎమ్మెల్యే అభినందించారు. కొత్తగా చేబ్రోలు తహశీల్దారుగా వచ్చిన కెవి గోపాలకృష్ణ సమర్ధవంతమైన సేవలను అందించడమే కాకుండా గ్రామా లకు వెళ్లి ప్రజల, రైతు సమస్యలను పరిష్కరిస్తున్నారని ప్రశంసించారు. తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు,ప్రజలు సహకారంతో మండల రెవెన్యూ శాఖ సర్వీసులు సక్రమంగా అందుతున్నాయని అన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా వచ్చిన 10,600 అర్జీలను, 486 రేషన్ కార్డుల సమస్యలను, 1120 రైతులు, కౌలు రైతులకు సంబంధించిన 650కు పైగా దరఖాస్తులను పరిష్కరించి నట్లు వివరించారు.

రెండేళ్ల ఉద్యోగ నిరీక్షణ ఫలించింది

జె లక్ష్మీ ప్రసన్న, వీఆర్ఏ

మా నాన్న శామ్యూల్ జాన్ విఆర్ఏ గా పనిచేస్తూ విధి నిర్వహణలో చనిపోయారు. రెండేళ్లుగా కారుణ్య నియామకం కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నా ఎవరూ పట్టించుకోలేదు. కొత్తగా వచ్చిన తహశీల్దార్ గోపాలకృష్ణ ను కలిసి నా పరిస్థితిని వివరించాను. ఆయన వెంటనే స్పందించారు. కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఈ నెల నాలుగునే నాకు కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తర్వులు అందాయి. సమస్య పట్ల ఎంతో సానుకూలంగా స్పందించిన తహశీల్దార్ కు ధన్యవాదాలు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

'మీ ఊరికే మీ తహశీల్దార్' మేలు చేసింది

- పాలేటి వెంకటేశ్వరు

నా పేరు పాలేటి వెంకటేశ్వరు. నేను సంఘం జాగర్లమూడి నివాసిని. నాకు చేబ్రోలు మండలం శేకూరులో పొలం ఉంది. గత ఐదేళ్లుగా తహశీల్దారు కార్యాలయం చుట్టూ తిరిగినా నా పొలము రికార్డుల్లోకి ఎక్కలేదు. ఇప్పుడు కొత్తగా వచ్చిన తహశీల్దారు, శేకూరుకు వచ్చి నిర్వహించిన 'మీ ఊరికే మీ తహశీల్దార్' కార్యక్రమంలో వీఆర్వో ఇచ్చిన సమాచారం మేరకు తహశీల్దారును కలిసి సమస్య చెప్పుకున్నాను. నా పొలానికి సంబంధించి వన్ బి అడంగల్ కాపీలు ఇచ్చారు. తహశీల్దార్ చేసిన ఈ సాయంతో నాకు ఎంతో మేలు జరిగింది.

ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న అధికారులు

ప్రజాశక్తి-తెనాలి

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని వివిధ విభాగాల్లో పని చేస్తున్న అధికారులకు ఉత్తమ సేవా పురస్కారాలను ప్రభుత్వం అందించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో స్థానిక నెహ్రూరోడ్డులోని శాఖా గ్రంథాలయం గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి ఉత్తమ సేవా ప్రశంసాపత్రాన్ని గుంటూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో మంత్రి ధర్మాన ప్రసాదరావు, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను గ్రంథాలయ సిబ్బంది, పలువురు పాఠకులు అభినందించారు. అలాగే, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెనాలి శాఖ ఆధ్వర్యంలో కొవిడ్ సమయంలో వైద్య సేవలందించిన ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళికి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయనను సహోద్యోగులు అభినందించారు.

మంత్రి ధర్మాన నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న రమాదేవి,
సబ్ కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న బాలచంద్రమౌళి

'తొలివిడత మేనిఫెస్టోతో వైసిపిలో దడ'

ప్రజాశక్తి-తెనాలి

తెలుగుదేశం పార్టీ విడుదల చేసిన మిని మేనిఫెస్టో వైసిపి శ్రేణుల్లో దడ పుట్టిస్తోందని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర మంగళగిరి చేరిన సందర్భంగా తెనాలి నియోజకవర్గం నుంచి యువత పెద్దఎత్తున బైక్ ర్యాలీ చేపట్టింది. 'హలో లోకేష్-ఛలో మంగళగిరి' పేరిట చేపట్టిన బైక్ ర్యాలీని బుధవారం రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకేష్ పాదయాత్ర అప్రతిహతంగా సాగుతోందని, మంగళగిరిలో లోకేష్‌ను కలిసేందుకు యువత పెద్ద ఎత్తున ఉవ్విళ్లూరుతోందని, వైసిపి అరాచక పాలనకు స్వస్తి పలి కేందుకు ప్రజలు కదం తొక్కుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు టి.హరిప్రసాద్, కె.కోటేశ్వరరావు, మహ్మద్ ఖుద్దూస్, ఇ.వెంకటపూర్ణచంద్ర, కె.శ్రీనివాసరావు, పి.రమ్య, కె.రమాదేవి, జె.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీలో ఆలపాటి రాజేంద్రప్రసాద్

'టిడిపి నాయకుల దుష్ప్రచారాలు నమ్మొద్దు'

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణ అభివృద్ధి కోసం చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. పొన్నూరు మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులకు భవన యజమానులు చక్కగా సహకరిస్తూ ఉంటే దాన్ని చూసి తెలుగు దుష్ప్రచారాల పార్టీ ఓర్వలేక పోతోం దంటూ తెలుగుదేశం పార్టీని విమర్శించారు. రోడ్డు విస్తరణ 60 అడుగులు కాదు 80 అడుగులని, డబ్బులు రాకుండానే భవనాల తొలగింపు ఎందుకు ఒప్పుకున్నారని, అసలు బాండ్లే రావని భవన యజమానులకు అనుమానం రేకెత్తించే మాటలతో దుష్ప్రచారాలు చేస్తున్నారని, వాటిని చూసి భవనయజమానులు నవ్వుకుంటున్నారని అన్నారు. త్వరలోనే మార్కెట్ విలువకు నాలుగు రెట్ల బాండ్లను భవన యజమానులకు అందజేయనున్నట్లు చెప్పారు. భవనాల తొలగింపు ప్రాంతంలో వచ్చే నెల మొదటి వారంలో డ్రైన్లు, రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. రానున్న కాలంలో రూ.6.7 కోట్లతో పట్టణంలో సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.

కలెక్టర్‌కు ఆహ్వానపత్రం అందజేస్తున్న ఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు

ఎపిఎన్‌జిఒ మహాసభలకు కలెక్టర్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి-గుంటూరు

విజయవాడలో ఈనెల 21న ఏపీ ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని అసోసియేషన్ జిల్లా నాయకులు బుధవారం జిల్లా కలెక్టర్ యం.వేణుగోపాల్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి ఆహ్వాన పత్రం అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు, కార్యదర్శి శెట్టిపల్లి సతీష్‌కుమార్, సంయుక్త కార్యదర్శి శ్యామ్‌సుందర్ శ్రీనివాస్, నగర అధ్యక్షులు ఎస్‌పిఎస్ సూరి, కిషోర్, అగ్రికల్చర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'వైసిపి నాయకుల కక్కుర్తి'

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణంలో రోడ్డు విస్తరణ పేరుతో విధ్వంసం సాగించడమే కాకుండా భవన యజమానులకు చెందిన శిథిలాల మెటీరియల్ లారీ ను రూ.1800 విక్రయించి సొమ్ము చేసుకోవడమే వైసిపి నాయకుల కక్కుర్తికి నిదర్శన మని పొన్నూరు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పఠాన్ అహ్మద్ ఖాన్ విమర్శించారు. మండలంలోని పచ్చల తాడిపర్రు డాన్ బోస్కో స్కూల్ వద్ద ఓ వైసిపి నాయకుడు వేసిన వెంచర్‌కు లారీకి రూ.1800 చొప్పున రెండు వందల లారీల మెటీరియల్‌ను పంపి రూ.3,60,000 వరకు వసూళు చేశారని ఆరోపించారు. ఆ సొమ్ము ఎవరి జేబులోకి వెళ్తుందో పురపాలక సంఘం అధికారులు వెల్లడించాలని డిమాండ్ చేశారు. కేవలం పొన్నూరే కాకుండా చేబ్రోలు బుడంపాడు, గుంటూరు వంటి పట్టణాలకు రాత్రివేళ గుట్టుచప్పుడు కాకుండా లారీల్లో మెటీరియల్ ను వైసిపి నాయకులు అమ్ముకుంటున్నారని ఆరోపించారు.

గౌతు లచ్చనకు బిసి సంక్షేమ సంఘం నివాళి

ప్రజాశక్తి-గుంటూరు

స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న 115వ జయంతిని పురస్కరించుకొని స్థానిక ఆర్టీసి బస్టాండ్ వద్ద గల ఆయన విగ్రహానికి మాజీ మంత్రులు కన్నా లక్ష్మీనారాయణ, నక్కా ఆనందబాబు, డొక్కా మాణిక్యవరప్రసాద్, బిసి సంక్షేమ సంఘం నాయకులు బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు, బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్, బిసి ఆర్గనైజింగ్ సెక్రెటరీ కోలా అశోక్, బిసి సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు డాక్టర్ నిమ్మల శేషయ్య, బిసి రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంతరావు, నవీన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మంగళగిరి

స్వాతంత్ర్య సమరయోధులు, బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన ఉద్యమ వీరుడు సర్దార్ గౌతు లచ్చన్న 115వ జయంతి వేడుకలను మంగళగిరి నియోజకవర్గ టీడీపీ కార్యాలయం బుధవారం ఘనంగా నిర్వహించారు. మంగళగిరి పట్టణ బీసీ సెల్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు వి. మాధవరావు మాట్లాడారు. కార్యక్రమంలో గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు, మంగళగిరి మండల పార్టీ అధ్యక్షులు టి.పార్ధసారథి, మంగళగిరి పట్టణ ఉపాధ్యక్షులు జి.దుర్గారావు, కె.సుకుమార్, వై.వెంకట్, కె.అంకమ్మరావు, కెవిటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ గౌస్‌కు నివాళి

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణానికి చెందిన మార్కెట్ వర్తక సంఘాల అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు షేక్ గౌస్ (మార్కెట్ గౌస్) బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య వారి గృహానికి వెళ్లి ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు గౌస్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. టిడిపి సీనియర్ నాయకులు, సంగం డెయిరి చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, షేక్ గౌస్ గారి పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి మురళీకి సన్మానం

ప్రజాశక్తి-తాడేపల్లి

టిఎన్‌టియుసి రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన అద్దంకి మురళీని బుధవారం ఆ పార్టీ కార్యాలయంలో పలువురు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ తన మీద నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను నెరవేరుస్తానని తెలిపారు. కార్యక్రమంలో వల్లభనేని వెంకటావు, సిహెచ్.రంగయ్య, డి.సుందరరావు యాదవ్, చల్లా శ్రీనివాసరావు, కె.శివప్రసాద్, ఎం.గోపాల రావు, ఢిల్లీ రామారావు పాల్గొన్నారు.

పల్నాడు ఎక్స్‌ప్రెస్ రజతోత్సవాలు

పాల్గొన్న డిఆర్ ఎం.ఎం.రామకృష్ణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు-వికారాబాద్ మధ్య నడిచే పల్నాడు ఎక్స్‌ప్రెస్ ప్రారంభించి ఆగస్టు 16 నాటికి 25ఏళ్లు అయిన సందర్భంగా రజతోత్సవ వేడుకలను రైల్వేఅధికారులు బుధవారం ఉదయం గుంటూరులో నిర్వహించారు. ఉదయం 5.30 గంటలకు రైలు వద్ద కేక్ కట్ చేసి రైల్వే డివిజనల్ మేనేజరు ఎం.రామకృష్ణ వేడుక నిర్వహించారు. ఈసందర్భంగా పల్నాడు ఎక్స్‌ప్రెస్‌సిబ్బందికి, రైల్వే అధికారులకు ఆయన అభినందనలు తెలిపారు.

ట్రాన్స్‌జెండర్స్‌కు ప్రత్యేక ఒపి విభాగం

ప్రారంభించిన మహిళా ఎస్‌పి సరిత

పాల్గొన్న ముస్తాఫా, అప్పిరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్సజెండర్స్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుదని తూర్పు యం యల్ ఏ ముస్తఫా అన్నారు. బుధవారం జిజిహెచ్‌లో ట్రాన్సజెండర్స్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఒపి విభాగాన్ని సూపరింటెం డెంట్ ఆఫ్ పోలీసు (ఎస్‌పి) కె.జి.వి సరిత బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముస్తఫా మాట్లాడుతూ ట్రాన్సజెండర్స్ సమస్యలను పరిష్కరిస్తా మన్నారు. సమాజంలో వీరంతా అనేక అవమానాలకు గురవుతున్నారని వీరు ఎదుర్కొనే సమస్యలను ప్రభుత్వం తో మాట్లాడి పరిష్కరిస్తానని ఆయన చెప్పారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ ట్రాన్సజెండర్స్ విషయంలో ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందన్నారు. వారికీ అవసరమైన రేషన్ కార్డులు అందించే విధంగా కషి చేస్తోంది. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకుని వస్తే తప్పకుండ పరిష్కరిస్తానని ఆయన చెప్పారు. కె జి వి సరిత మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేకంగా ట్రాన్సజెండర్స్ కోసం ప్రత్యేక ఒపిని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆమె అన్నారు. వారికి ప్రత్యేకంగా గౌరవించే విధంగా ఒపి ఏర్పాటు చేసారని ఆమె అన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ట్రాన్సజెండర్స్ బాగా చదువుకుని ఉన్నత స్థానంలో చేరుకోవాలని ఆయన సూచించారు. దీనివల్ల ఎంతోమందికి ఉపాధి అవకాశాలు దొరుకుతాయని ఆయన అన్నారు. ఆసుపత్రి కి వచ్చే ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందిస్తామని ఆయన చెప్పారు. ఒ పి లో ఒక మెడిసిన్ డాక్టర్, నర్సు, సిబ్బంది ఉంటారని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమం లో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి ఎస్ ఎస్ శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ యం ఒ డాక్టర్ సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని, వైసీపీ దివ్యంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బి కిరణ్ రాజు, ఆర్ కె ఫౌండేషన్ చైర్ పర్సన్ రమ కిరణ్ పాల్గొన్నారు.

నూతన సంస్థల స్థాపనకు కృషి చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న భరత్‌కుమార్ రెడ్డి

విద్యార్థులందరూ ఏదో ఒక సంస్థలో ఉద్యోగం చేయటం కంటే నూతన సంస్థల స్థాపనకు కృషి చేసినట్లైతే చాలా మందికి ఉద్యోగా లు కల్పించిన వారవుతారని హైదరాబాద్ లోని ప్రాగ్మాటిక్ సిస్టమ్స్ ఫౌండర్, సీఈవో భరత్ కుమార్‌రెడ్డి గుజవర్తి అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాలలోని సీఎస్‌ఈ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నాలుగో సంవత్సరం విద్యార్థులకు ' ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ యాస్ ఏ టూల్ టు సస్టేనబుల్ ఎంప్లాయ్‌మెంట్' అనే అంశంపై ప్రత్యేక అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోని ప్రఖ్యాతి గాంచిన సంస్థలన్నీ ఒకప్పుడు చిన్న చిన్న సంస్థలుగా మొదలు పెట్టి, పెద్దపెద్ద సంస్థలుగా రూపాంతరం చెందాయన్నారు. విద్యార్థులకు ప్రస్తుతం ఉద్యోగ అవకాశాలు విరివిగా లభిస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత ఎవరికీ లేదని తెలియజేశారు. విద్య, ఆరోగ్య, రసాయన రంగాలలో చిన్న, మధ్య తరగతి పరిశ్రమలలో2030 నాటికి ఎటువంటి ఆవిష్కరణలు, పరిశ్రమలు స్థాపించవచ్చో వివరించారు. విద్యార్థులు నూతన పరిశ్రమలు స్థాపించాలంటే పరిశ్రమలలోని అన్ని విభాగాలను అర్థం చేసుకోవాలన్నారు. ఐటీ రంగంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి సంస్థలు స్థాపించటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు నూతన ఆవిష్కరణలకు ఎటువంటి ఆర్థిక సహాయం అందజేస్తుందో వివరించారు. అనంతరం మేరా మాటి-మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, సాక్ విద్యార్థులందరూ కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే.ఫణీంద్ర కుమార్, ఆయా విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుండె చికిత్సలపై ప్రత్యేక దృష్టి

సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుండె పోటు చికిత్సలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని ఏపీ సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం శు శృత హాలులో ఏపీ స్టేమి ప్రాజెక్టులో భాగంగా డాక్టర్స్, సిబ్బందికి శిక్షణ తరగతుల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు, విశాఖపట్నం, కర్నూలు, చిత్తూరు జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ లుగా తీసుకున్నామన్నారు. డిసెంబర్ ఆఖరు నాటికి రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి తీసుకుని వస్తామని ఆయన చెప్పారు. గుండె పోటుతో మరణించే వారి సంఖ్యను తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. గుండె పోటు వచ్చిన తొలి గంటలో రోగికి ఈసిజి తీసి వెంటనే అంబులెన్సుకు సమాచారం ఇవ్వాలి. ఆ వెను వెంటనే ప్రభుత్వ ఆసుపత్రి కి రోగిని పంపించాలని ఆయన సూచించారు. రోగికి వెంటనే రూ.40 వేలు విలువ చేసే ఇంజక్షన్ చేయడం ద్వారా ప్రాణాలతో బయట పడుతారని ఆయన వివరించారు. ఇలా చేయడం వల్ల ఎంతోమంది ప్రాణాలను కాపాడేందుకు అవకాశం ఉంటుందన్నారు. గుండె పోటు మారణాలను తగ్గించడం కోసం ఈ ప్రాజెక్టను అమల్లోకి తీసుకుని వస్తున్నారని ఆయన చెప్పారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో గుండె పోటుతో బాధ పడే రోగులకు వెంటనే ఈ సి జి తీసి జిల్లా ఆసుపత్రులకు పంపించిన వెంటనే కార్డియాలాజిస్టి లు ఇంజక్షన్ లను చేయడం వల్ల బ్రతికించే అవకాశాలు ఉన్నాయన్నారు. రోగి ఆరోగ్య అవసరాన్ని బట్టి హార్ట్ సర్జరీ కూడా చేసేందుకు అవకాశం ఉందని ఆయన చెప్పారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సమాచారాన్ని చేరువ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమం లో స్టేమి నోడల్ అధికారి డాక్టర్ మునీశ్వర్, గుంటూరు, పల్నాడు జిల్లాల ఆసుపత్రుల సమన్వయ అధికారులు డాక్టర్ జె హనుమంత రావు, డాక్టర్ బి వి రంగా రావు, జిజిహెచ్ కార్డిలయాలజిస్ట్ హెచ్ ఒ డి డాక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు

జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి, నిర్దేశిత లక్ష్యాలను అదిగమించేలా అధికారులు సమన్వయంతో ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణు గోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ నుండి కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జెసి రాజకుమారితో కలిసి జగనన్నకు చెబుదాం, వ్యవసాయ, గ్రామ, వార్డు సచివాలయాల సేవలు, హౌసింగ్, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాల పురోగతి, గడప గడపకు మన ప్రభుత్వం, రెవెన్యూ అంశాలపై సబ్ కలెక్టర్, ఆర్డీవో, ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దారు, ఎంపీడీవో, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్, హౌసింగ్ అధికారులతో, మండల వ్యవసాయ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కౌలు రైతులందరికీ సిసిఆర్సీ కార్డులు మంజూరు అయ్యేలా వ్యవసాయశాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పంపిణీ

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

చేయాలన్నారు. గ్రామాల్లో నిర్మిస్తున్న ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల్లో రూఫ్ లెవల్, అపైన పూర్తి అయిన భవనాలను సెప్టెంబరు 15 నాటికి పూర్తి చేసి వినియోగంలోకి తేవాలన్నారు. ఫినిషింగ్‌లో ఉన్న భవనాల పెండింగ్ పనులు త్వరతిగతిన పూర్తి చేసి సంబంధిత శాఖలకు అందించాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు భవన నిర్మాణాల పురోగతిలేని మండలాల అధికారులు ప్రత్యేక దష్టి పెట్టి నిర్మాణ ఏజెన్సీలతో నిరంతరం పర్యవేక్షించి పనులు వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణాలలో స్టేజ్ కన్వర్షన్ పూర్తి చేయాలన్నారు అదే విధంగా నిర్మాణం పూర్తి అయిన గృహాలకు విధ్యుత్ సరఫరా, మంచి నీటి సదుపాయం అందిచాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద మంజూరు చేసిన పనుల పురోగతి పై సమీక్షించారు. అమ్మ ఒడికి సంబందించి ఈ కెవైసీ శుక్రవారం నాటికి పూర్తి చేయాలన్నారు. బడి మానేసిన పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్పించి వారి వివరాలను సంబందిత యాప్‌లో పొందుపరచాలన్నారు. జెసి రాజకుమారి మాట్లాడుతూ రీ సర్వేకి సంబంధించి సబ్ డివిజన్, మ్యూటేషన్‌కు సంబంధించి ధరఖాస్తులను సక్రమంగా పరిష్కరించాలన్నారు.

జగనన్నకు చెబుదాం అర్జీలను జిల్లా స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించి దరఖాస్తుదారులు సంతప్తి చెందేలా మెరుగైన పరిష్కారం అందించా లన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ కె.చంద్రశేఖర్‌రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, పంచాయితీ రాజ్ ఎస్‌ఈ బ్రహ్మయ్య, హౌసింగ్ పిడి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

తిరోగమన వేతన ఒప్పందాన్ని రద్దు చేయాలి

విద్యుత్ ఉద్యోగుల స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

నిరసన తెలియజేస్తున్న కార్మికులు, ఉద్యోగులు

విద్యుత్ ఉద్యోగులకు జరిగిన తిరోగమన వేతన ఒప్పందాన్ని రద్దు చేయాలని రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా స్థానిక గుజ్జనగుండ్ల విద్యుత్ కార్యాలయం ఎదుట విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యుత్ యాజమాన్యం విద్యుత్ జెఎసితో చేసుకున్న వేతన ఒప్పందంతో ఉద్యోగులకు, కాంట్రాక్ట్, పీస్ రేట్ కార్మికులకు ఎలాంటి ఉపయోగం లేకపోగా, నష్టదాయకంగా ఉందని అన్నారు. 2014 వరకూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఒకే పిఆర్‌సిని పొందిన విద్యుత్ ఉద్యోగులు 2018 నుండి ఇప్పటి వరకూ వేర్వేరుగా పొందటమే కాకుండా 30శాతం తక్కువ వేతనాలతో ఏపీ ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ విద్యుత్ ఉద్యోగులకు ఎక్కువ జీతాలు ఉన్నాయని యాజమాన్యం, ప్రభుత్వాలు ప్రచారం చేస్తున్నాయన్నారు. అవుట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులు రూ.13వేల జీతంతో పనిచేస్తున్నారని చెప్పారు. సమాన పనికి సమాన వేతనం ఇస్తామని చేసిన వాగ్ధానం గుర్తు రావట్లేదా అని ప్రశ్నించారు. 45 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ జరపాలని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని అడుగుతుంటే '0' శాతం ఇస్తామని, 8 శాతంతో సర్దుకోండి అని, ఇదే మంచి పిఆర్‌సి అని ప్రకటించం సరికాదన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పీస్ రేట్ కార్మికులు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్ట్రగుల్ కమిటీ నాయకులు పూర్ణ, సిఐటియు నగర ఉపాధ్యక్షులు షేక్.ఖాసింవలి, నాయకులు విల్సన్, లక్ష్మణ్, ప్రసాద్, రాంబాబు, వాణి, సంధ్య సమీర్, హృదయరాజు తదితరులు పాల్గొన్నారు.